
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.3 । కనిష్ఠం 20.7



కామారెడ్డి జిల్లా వార్తలు

గురువారం 20 మార్చి 2025

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.33 (గురువారం సాయంత్రం) సహర్ : 4.58 (శుక్రవారం ఉదయం)

విధి రాత (తఖ్‌దీర్)ను దువా తప్ప మరేది మార్చజాలదు అదృష్టాన్ని మార్చగలది ఏదైనా ఉన్నదంటే అది ప్రార్థన, దువా మాత్రమే.



సంక్షేమానికి పెద్దపీట

- బడ్జెట్‌లో ఆరు గ్యారెంటి పథకాలకు మొదటి ప్రాధాన్యత
- అభివృద్ధి, వ్యవసాయానికి ఆశించిన మేర నిధులు
- ప్రజా సంక్షేమ బడ్జెట్ అంటున్న అధికార పార్టీ
- ఆరు గ్యారెంటీలకు రూ.56.84 కోట్లు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.12,571 కోట్లు
- రైతుభరోసాకు రూ.18వేల కోట్లు
- ఇరిగేషన్, గ్రామీణాభివృద్ధికి భారీగా నిధులు కేటాయింపు
- విద్య, వైద్య రంగాలకు నిధుల కేటాయింపు
- అంకెల బడ్జెట్‌గా పేర్కొంటున్న ప్రతిపక్షాలు
- బడ్జెట్‌లో కేటాయిస్తున్నారనే తప్ప అమలు చేయడం లేదు

కామారెడ్డి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. కాంగ్రెస్ ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారెంటీ పథకాలతో పాటు సంక్షేమ పథకాలనే లక్ష్యంగా పెట్టు కుని బడ్జెట్‌ను రూపొందించి వాటికి ప్రాధాన్యత ఇస్తు ఎక్కువ నిధులను కేటాయించినట్లు తెలుస్తోంది. రెండోసారి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజా సంక్షేమంతో పాటు గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ సహకారానికి, నీటి పారుదల, మహిళా అభివృద్ధికి ఈ బడ్జెట్‌లో వేల కోట్ల నిధులను కేటాయించారని అధికార పార్టీ నేతలు అభిప్రాయ పడుతున్నారు. అదేవిధంగా విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తూ అధిక మొత్తంలోనే నిధులు కేటాయించినట్లు తెలుస్తోంది. మంత్రి ప్రవేశ పెట్టిన బడ్జెట్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉందని అధికార పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. ఈ బడ్జెట్ అంకెల బడ్జెట్ తప్ప ఏ ఒక్క వర్గానికి న్యాయం చేయదని ప్రతిపక్ష పార్టీల నేతలు మండిపడుతున్నారు. గతంలో లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఖర్చు చేయలేకపోయిందని, ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయలేకపోయిందని ప్రతిపక్షపార్టీల నేతలు మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రతిపక్ష, అధికార పార్టీల నుంచి భిన్నాభిప్రాయాలు వెలువెత్తుతున్నాయి. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ నిధులు జిల్లాలోని అభివృద్ధికి, ప్రాజెక్టుల పనులకు సంక్షేమానికి ఎంత మేరకు వస్తాయో వేచి చూడాలి.

ఆరు గ్యారెంటీలకే మొదటి ప్రాధాన్యత

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోంది. ఆ హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో మొదటి ప్రాధాన్యతను ఇస్తోంది. ప్రధానంగా ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తోంది. రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇల్లు, యువ వికాస్, చేయూత, మహాలక్ష్మీ, రైతుభరోసా, గృహజ్యోతి, సబ్సిడీ సిలిండర్ లాంటి పథకాలను అమలు చేస్తామని హామీని నిలబెట్టుకుంటుంది. ఇందులో భాగంగా ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేసేందుకు ఈ సారి రూ.56,084కోట్ల నిధులను కేటాయించారు. ఈ నిధులను బట్టి చూస్తే ఈ ఆరు స్కీంలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. గృహజ్యోతికి రూ.2,080 కోట్లు, రైతుభరోసాకు రూ.18 వేల కోట్లు, సన్నధాన్యం బోనస్‌కు రూ.1800ల కోట్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు రూ.600ల కోట్లు, రాజీవ్‌యువ వికాస్‌కు రూ.6వేల కోట్లు, ఇందిరమ్మ ఇళ్లకు రూ.12,571కోట్లు, మహాలక్ష్మీకి రూ.4,305కోట్లు కేటాయించారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ సంక్షేమాలకు సైతం వేల కోట్లలోనే నిధులు కేటాయించారు. ఎస్సీ సంక్షేమానికి రూ.40,232 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ.17,139 కోట్లు, మైనార్టీ సంక్షే మానికి రూ.3591కోట్లు, బీసీ సంక్షేమానికి రూ.11,406 కోట్లు కేటాయించారు.

అభివృద్ధి, వ్యవసాయానికి నిధుల కేటాయింపు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అభివృద్ధి, వ్యవసాయరంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి రూ.24,439 కోట్లు

(మిగతా 8వ పేజీలో)

అన్నివర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైన బడ్జెట్

● షబ్బీర్‌అలీ, ప్రభుత్వ సలహాదారు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైన బడ్జెట్. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీశాఖలకు తగిన ప్రాధాన్యం లభించేలా ప్రయత్నం చేశాం. నిరుద్యోగ యువతలకు ఉద్యోగావకాశాలు కల్పించే ఉద్దేశ్యంతో జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తాం. వ్యవసాయ, పట్టాణాభివృద్ధి, మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చాం. ఆరు గ్యారెంటీల అమలుకు రూ.56.84 కోట్లు, రైతు భరోసాకు రూ.18వేల కోట్లు, వ్యవసాయానికి రూ.43 వేల కోట్లు, సంక్షేమశాఖలన్నింటికీ రూ.40 వేల కోట్లు, విద్యుత్‌శాఖకు రూ.21,221 కోట్లు, వైద్య శాఖకు రూ.12,393 కోట్లు నిధులు కేటాయించాం.

బడ్జెట్‌లో మహిళలను విస్మరించారు

● ముజిబొద్దీన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మహిళా అభివృద్ధికి నిధులు కేటాయించకుండా వారిని విస్మరించారు. ఎన్నికల సమయంలో మహిళలను లక్షాధికారులను చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి వారి ఓట్లతో అధికారంలోకి వచ్చింది. ప్రతీ మహిళకు రూ.2500 ఇస్తామని, యువతులకు స్కూటీ కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ బడ్జెట్‌లో ఆ పథకాలను విస్మరించారు. కానీ హైదరాబాద్‌లో నిర్వహించే అందాల పోటీలకు మాత్రం రూ.200ల కోట్లు కేటాయించడం మహిళలను వంచించడమేనని అన్నారు. ప్రభుత్వానికి మహిళల పట్ల ఎలాంటి చిత్తశుద్ధి వుందో ఈ బడ్జెట్‌తో తెలుస్తోంది.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలు
- పరీక్షల నిర్వహణకు జిల్లాలో మొత్తం 64 సెంటర్ల ఏర్పాటు
- హాజరుకానున్న 12,579 మంది విద్యార్థులు : డీఈవో రాజు

కామారెడ్డి టౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభం అయ్యే పదో తరగతి పరీక్షలకు జిల్లా విద్యాశాఖ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఈ పరీక్షలు ఈనెల 21వ తేదీ నుంచి వచ్చేనెల 4వ తేది వరకు కొనసాగనున్నట్లు డీఈవో రాజు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 64 సెంటర్‌లను ఏర్పాటు చేయగా 12,579 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో బాలురు 6,127 మంది, బాలికలు 6,452 మంది ఉన్నారు. ఈనెల 21న ఫస్ట్ లాంగ్వేజ్, 22న సెకండ్ లాంగ్వేజ్, 24న ఇంగ్లీషు, 25న గణితం, 26న ఫిజికల్ సైన్స్, 27 బయోలజికల్ సైన్స్, 28న సోషల్ స్టడీస్ పరీక్షలు నిర్వహించనున్నారు. 64 మంది సీఎస్, 64 మంది డీఓలు, రూట్ ఆఫీసర్స్ 5, కస్టోడియన్స్ 22, ఫ్లయింగ్ స్క్వాడ్స్ 3, సిట్టింగ్ స్క్వాడ్స్ 12, ఇన్విజిలేటర్స్ 699 మంది నియమించారు.

అర గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి

ఉదయం 9.30 నిమిషాల నుంచి 12.30 నిమిషాల వరకు పరీక్షలు జరుగనున్నాయి. విద్యార్థులు పరీక్షకు హాజరయ్యేటప్పుడు, పరీక్ష కేంద్రంలో వ్యవహరించాల్సిన పలు సూచనలను వివరిస్తూ వాటిని పకడ్బందీగా అమలు చేసే పనులు విద్యాశాఖ అధికారులు ఉండనున్నారు. పరీక్ష కేంద్రానికి హాజరయ్యే విద్యార్థి హాల్ టికెట్, రైటింగ్ ప్యాడ్, పెన్స్, పెన్సిల్ వంటి రాత సామగ్రి తప్ప మిగిలిన ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, ప్రింటెడ్ పుస్తకాలు ఎట్లాంటివి అనుమతించబడువని సూచించారు. విద్యార్థిని, విద్యార్థులు పరీక్ష సమయంలో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వెళ్లకూడదు. సమాధాన పత్రం పూర్తిగా నింపినప్పటికీ కేటాయించబడిన పూర్తి పరీక్ష సమయం ముగిసే వరకు హాల్ నుంచి బయటకు అనుమతించబడదు. విద్యార్థులకు ఇచ్చిన ఓఎమ్మార్ షీట్లలో ఏ పొరపాట్లు ఉన్నా ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు.

హాల్‌టికెట్ చూపిస్తే.. బస్సులో ఉచిత ప్రయాణం

పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించబడింది. అందుకు గాను విద్యార్థులు వారి హాల్ టికెట్‌ను బస్సు కండెక్టర్‌కు చూపిస్తే సరిపోతుంది. ఎండలు మండే అవకాశమున్నందున పరీక్ష కేంద్రాల వద్ద ఏఎన్ఎంను నియమించి ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు మందులు అందుబాటులో ఉంచనున్నారు.

విద్యార్థులే కాకుండా సిబ్బంది నియమాలు పాటించాల్సిందే..

పరీక్షలకు హైదరాబాద్ నుంచి స్టేట్ అబ్జర్వరుతో పాటు ఇన్విజిలేషన్ చేసే సిబ్బంది, చీఫ్ సూపరింటెండెంట్‌లు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందం పరీక్షల విధుల్లో పాల్గొననున్నారు. అయితే విద్యార్థులతో పాటు వారు పలు నియమాలు పాటించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష కేంద్రానికి కేటాయించబడిన సిబ్బంది అందరు గుర్తింపు కార్డును ధరించాలి. సిబ్బంది తప్ప ఇతరులకు ప్రవేశం లేదు. పరీక్ష పర్యవేక్షణ అధికారి అనుమతి లేనిదే ఎవరికి పరీక్ష హాల్‌లోకి ప్రవేశం ఉండదు. పరీక్ష కేంద్రంలోకి చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్, ఇన్విజిలేటర్, మెడికల్ సిబ్బంది, అటెండర్, వాటర్ బాయ్స్, అభ్యర్థులు, ఇతర పరీక్ష నిర్వహణ సిబ్బంది ఎవరు కూడా సెల్‌ఫోన్, పేజర్లు, క్యాలిక్యులేటర్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకుపోకూడదు. ఒకవేళ అలా కనిపించినచో మాల్ ప్రాక్టిస్ క్రింద కేసు నమోదు చేయనున్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో అత్యవసర సమాచారంలో పోలీసు సిబ్బంది ఫోన్ మాత్రమే వినియోగిస్తు ఇన్‌కమింగ్ అవుట్ గోయింగ్ కాల్స్ రిజిస్టర్‌లో రాయాలి. పరీక్ష కేంద్రం చుట్టు పక్కల 100 మీటర్ల వరకు 144 సెక్షన్ విధించనున్నారు. అంతేకాకుండా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిరాక్సు సెంటర్‌ను మూసి ఉంచాలి.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నాం

● రాజు, డీఈవో

జిల్లాలో బుధవారం నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎక్కడ ఏ చిన్న అవంతరాలు జరుగకుండా పకడ్బందీగా పరీక్షలను నిర్వహించనున్నాం. ఇందుకోసం 64 సెంటర్‌లను ఏర్పాటు చేశాం. విద్యార్థులు ముందురోజే తమ పరీక్ష కేంద్రాన్ని సందర్శిస్తే సులువుగా ఉంటుంది. విద్యార్థులు పరీక్షలకు సంబంధించిన సామగ్రి తప్ప ఏ ఇతర సామగ్రి వెంట తీసుకురాకుడదు. విద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూం నెంబర్ 90326 95219 ఏర్పాటు చేశాం.

ప్రతీ గ్రామానికి ఒక పోలీసు అధికారి ఉండేలా చర్యలు తీసుకోవాలి : ఎస్పీ

కామారెడ్డి టౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రతీ గ్రామానికి ఒక పోలీసు అధికారి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ రాజేష్‌చంద్ర అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతీ విషయాన్ని పరిశీలించి ఫైనల్ చేయాలన్నారు. పోక్సో, గ్రేవ్ కేసుల్లో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తిచేసి కోర్టులో నిర్ణీత సమయంలో చార్జిషీట్ దాఖలు చేయాలని తెలిపారు. అదేవిధంగా కేసుల్లోని సాక్షులకు కోర్టులో సాక్షం చెప్పే సమయంలో ముందస్తుగా వారితో మాట్లాడి కేసు విషయాలు తెలియజేయాలన్నారు. అదేవిధంగా నేరస్తులకు శిక్షపడే విధంగా కృషి చేయాలని తెలిపారు. అన్నిరకాల ఫిర్యాదులపై చట్టప్రకారం స్పందించి ఫిర్యాదు దారులకు ఎప్పటికప్పుడు సందేశం మొబైల్ ద్వారా అందించాలని తెలిపారు. గ్రామాల్లో సీసీటీవీల యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తు బ్యాంక్, ఏటీఎం, పెట్రోల్ బంక్, ప్రార్థన స్థలాల యందు సీసీటీవీల ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. జిల్లాలో దొంగతనాలు, ఇతర రకాల నేరాలు జరగకుండా, నేరాల నియంత్రణకు విజబుల్ పోలీసింగ్ పెంచాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు నరసింహారెడ్డి, చైతన్యారెడ్డి, డీఎస్పీలు శ్రీనివాస్‌రావు, సత్యనారాయణ, ఎస్‌బీ సీఐ తిరుపయ్య, డీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్ మురళి, సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులను సజావుగా నిర్వహించాలి

● శ్రీనివాస్‌రెడ్డి, ఓటర్ల నమోదు అధికారి



మద్నూర్‌లో పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి

మద్నూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : జుక్కల్ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కామారెడ్డి జిల్లా ఎన్నికల సంఘం గుర్తింపు కల్గిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జుక్కల్ నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డి. శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు సజావుగా, తప్పులు లేకుండా చేయాలని ఆదేశించారు. ఓటరులకు ప్రభుత్వ యంత్రంతో పాటు, రాజకీయ పార్టీల వారు కూడా ప్రజలకు ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులపై, గుర్తింపు కార్డుకు ఆధార్ నెంబర్, ఫోన్ నెంబర్ లింక్ చేసుకునే విధంగా అవగాహన కల్పించి చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతీ పోలింగ్ కేంద్రానికి ఒక్కరి చొప్పున ప్రతీ పార్టీ (ఎన్నికల సంఘం గుర్తింపు) వారు బూత్ లెవల్ అసిస్టెంట్‌లను నియమించుకోవాలని పార్టీల ప్రతినిధులకు సూచించారు. మరణించిన వారి ఓటరులను సంబంధిత కుటుంబ సభ్యులకు నోటీస్ ఇచ్చిన తర్వాత ఓటరు జాబితా నుంచి మరణించిన వారి పేర్లు తొలగించాలని తహసీల్దార్‌లకు ఆదేశించారు. గతంలో చాలా మండలాల్లో 80 శాతంకు పైగా ఆధార్ లింక్ చేయడం జరిగింది. మిగతా నమోదు కాని వారిని లింక్ చేసుకునే విధంగా ప్రచారం చేసి స్థానిక పోలింగ్ అధికారుల ద్వారా నమోదు ప్రక్రియ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో నియోజకవర్గ తహసీల్దార్‌లు, నాయబ్ తహసీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు బాలు షిండే, కృష్ణ పటేల్, కే హన్మాండ్లు రోహిదాస్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

కామారెడ్డి టౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అండర్-14,16,18,20, మెన్ అండ్ ఉమెన్ ఎంపికలను నిర్వహించారు. ఇందులో 180 మందికి పైగా క్రీడాకారులు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు పలువురు ఎంపికయ్యారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనిల్ తెలిపారు. వీరు ఈనెల 23న హైదరాబాద్‌లోని కొల్లూరు గార్డియం స్పోర్టియం పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన వారిలో ఈశ్వర్, విజయేందర్, పల్లవి, గణేష్, జగదీష్, నితిన్, నక్షత్ర, సునిత, ప్రతాప్‌సింగ్, పరమేష్, భబిత, సునిత, రోహన్, ఈశ్వర్ ప్రసాద్, పవన్‌కళ్యాణ్, రాహుల్, రాజేష్, సిరిలు ఉన్నారు.



ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు



లింగంపేట జూనియర్ కళాశాలలో పరీక్షలు రాసిన ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు

లింగంపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ప్రథమ సంవత్సరం చివరిరోజు రసాయన శాస్త్రం పేపర్-1కు 245 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 237మంది పరీక్షలకు హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ దుర్గయ్య, డిపార్ట్‌మెంటల్ అధికారి సంతోష్‌లు తెలిపారు. కామర్స్ పేపర్-1కు 51మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 48 మంది పరీక్షలు రాశారని ఆయన తెలిపారు. మొత్తం 296 మందికి 11 మంది గైర్హాజరయ్యారని 285 మంది పరీక్షలు రాశారని తెలిపారు. కస్తూర్బా, జ్యోతి బాపూలే, మైనారిటీ గురుకులల్లో చదివే విద్యార్థులు వసతి గృహాలను ఖాళీచేసి ఇంటి దారి పట్టారు.

ఎల్లారెడ్డి : ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారంతో ప్రశాం తంగా ముగిశాయి. ఎల్లారెడ్డి పరీక్షా కేంద్రంలో 286 మంది విద్యార్థులకు గాను 276 మంది విద్యార్థులు హాజరయ్యారు. పది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ నిజాం తెలిపారు. ఎల్లారెడ్డి ఆదర్శ పాఠశాల ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 239 మందికి గాను 233 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఆరుగురు గైర్హాజర్ అయినట్లు ప్రిన్సిపాల్ గాంధీ తెలిపారు.

లక్ష్యానికి అనుగుణంగా రుణాలు మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి వివిధ అంశాల్లో లక్ష్యానికి అనుగుణంగా అర్హత గల వారికి రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ బ్యాంకుల అధికారులు, మేనేజర్‌లు, పలు ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పంట రుణాలు, వ్యవసాయ అనుబంధ రుణాలు, ఎంఎస్ఎంఈ, హౌసింగ్, విద్యారుణాలపై సమీక్షించారు. జిల్లాలో వ్యవసాయాధారిత రుణాలకు అవకాశాలు ఉన్నందున పంట, అనుబంధ రుణాలు పెంచాల్సిందిగా ఆదేశించారు. జిల్లాకు రవాణా సౌకర్యాలు కలిగి ఉన్నందున ఎంఎస్ఎంఈ టర్మ్ రుణాలు పెంచాలని తెలిపారు. డిసెంబరు 2024 నాటికి అంతమయ్యే మాసాంతానికి 6412.60 కోట్లకు గాను 4186 కోట్లు సాధించడం జరిగిందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ప్రాధాన్యతారంగా రుణాలను పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం వచ్చే ఆర్థిక సంవత్సరానికి నాబార్డ్ సిద్ధం చేసిన ప్లాన్‌ను ఆవిష్కరించారు. జిల్లాలో 100 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రజలకు మోడల్ సీఎస్సీల ద్వారా ప్రభుత్వ, బ్యాంకింగ్, ఆధార్‌సేవలను విస్తృతం చేయుటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేశాయి. అందులో భాగంగా మోడల్ సీఎస్సీ కేంద్రం సంబంధించిన ప్రాజెక్ట్ ఆమోదించడం జరిగిందన్నారు. నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాసం కింద ఈ మోడల్ సీఎస్సీ కేంద్రాలకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పీఎంఈజీపీ కింద సబ్సిడీతో రుణాలు 60 నుంచి 80 శాతం మంజూరు చేయనున్నారని తెలిపారు. మహిళా శక్తి కింద ఈ పథకంలో మహిళలకు 40 నుంచి 50 శాతం కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, నాబార్డ్ డీడీఎం ప్రవీణ్, ఆర్‌బీఐ ఏపీఎం పృథ్వి, ఎల్‌డీఎం రవికాంత్, డీఆర్‌డీవో సురేందర్, మోడల్ సీఎస్సీ రాష్ట్ర ప్రాజెక్ట్ మేనేజర్ హరికృష్ణకుమార్, జిల్లా మేనేజర్ అరుణ్‌తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని, అందుకు మంజూరు ఇవ్వడంతో పాటు పనులు ప్రారంభించడం జరిగాయని, ఈ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. రెండు పడక గదుల ఇళ్ల కాలనీలకు మిషన్‌భగీరథ నీటిని సరఫరా చేయుటకు పైప్‌లైన్‌లు, ట్యాంకులు, సంపుల నిర్మాణాలు త్వరితగతిన చేయాలని అన్నారు. మిషన్ భగీరథ ఇంటి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. బ్లాక్ మేకింగ్ యూనిట్ల తయారీకి మహిళా సంఘాలకు యూనిట్లు మంజూరు చేయాలని తెలిపారు.

ఇసుక సరఫరాకు జాయింట్ సర్వే నిర్వహించి నివేదికలు సమర్పించాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక సరఫరాకు జాయింట్ సర్వే నిర్వహించి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కావాల్సిన ఇసుక నిమిత్తం జాయింట్ సర్వే నిర్వహించాలని రెవెన్యూ, మైనింగ్, భూగర్భ జలశాఖ, నీటి పారుదల శాఖల అధికారులను ఆదేశించారు. మంజీరా నదిపై జరిగే ఇసుక అక్రమ రవాణాను అరికట్టడం కోసం చెక్ పాయింట్ల ఏర్పాటు చేయాలని రెవెన్యూ, పోలీసు, తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాలను అరికట్టేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ పాయింట్‌ల వద్ద సీసీటీవీలు ఏర్పాటు చేయాలని తెలిపారు.

ఆత్మ విశ్వాసం ఉంటే అద్భుతాలు సాధించవచ్చు

దివ్యాంగ విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ఉంటే జీవితంలో అద్భుత ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బాలుర పాఠశాలలో సమగ్రశిక్ష, భారతీయ దివ్యాంగుల పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఉప కరణాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు వెన్నుతట్టి ప్రోత్సహిస్తు వాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని నింపాలన్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. 2014లో ఒక దివ్యాంగ విద్యార్థి సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో టాపర్‌గా నిలిచిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. జిల్లాలో గుర్తించబడిన 207 మంది దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, ఆర్‌డీఓ వీణ, జిల్లా సంక్షేమాధికారి ప్రమీల, అలిమ్‌కో ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్షల సామగ్రి పంపిణీ



ఖుద్వాన్‌పూర్‌లో విద్యార్థులకు పరీక్షల సామగ్రిని అందజేస్తున్న ఎస్ఐ

నందిపేట,మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సామాగ్రిని ఎస్ఐ ఎం చిరంజీవి ఉచితంగా పంపిణీ చేశారు. ఆర్మూర్ నియోజక వర్గం యువజన కాంగ్రెస్ అధ్య క్షుడు బైండ్ల ప్రశాంత్, మండల అధ్యక్షుడు గుండు హరీష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షల ప్యాడ్లు,పెన్నులు,పెన్సిల్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ చిరంజీవి మాట్లాడుతూ బయపడకుండా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. మెరుగైన ఫలితాలు సాధిస్తేనే ఉన్నతమైన స్థానంలో చోటు దక్కుతుందని, ప్రతీ ఒక్క విద్యార్థి (10/10) సీపీఏ సాధించాలని ఎస్ఐ చిరంజీవి సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు సుచరిత, మాజీ ఉపసర్పంచ్ మంగ్లారపు చిరంజీవి, ఎల్లమ్మ దేవస్థానం మాజీ చైర్మెన్ సుంకరి సంతోష్, పాఠశాల చైర్మన్ జావెద్, గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బొమ్మశ్రీకాంత్, నాయకులు పెరుకప్రశాంత్, నంగి నవీన్, గోజూర్ సోశెట్టి, ముజ్జు, టీచర్లు ఉన్నారు.

ఇసుక అక్రమార్కులకు
రెవెన్యూ అధికారి అండదండలు

● ఆర్ఐ వాయిస్ రికార్డు సోషల్ మీడియాలో వైరల్

బోధన్‌రూరల్,మార్చి19(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన ఓ రెవెన్యూ అధికారి ఏకంగా వారికి అండదండలు అందించాడు. ఉన్నతాధికారుల నిఘా లేదని వారికి లీకులు ఇస్తూ అక్రమ రవాణా పాటించేలా వ్యాపారులను ప్రోత్సహించారు. కాగా వారి వద్ద నుండి పెద్ద ఎత్తున మాముళ్లు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇసుక వ్యాపారస్థుడితో ఫోన్‌లో మాట్లాడిన సంభాషణ సోషల్ మీడియాలో బుధవారం వైరల్ కావడంతో చర్చకు దారి తీసింది. బోధన్ రూరల్ మండలం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంగాధర్‌పై అవినీతి ఆరోపణలు తలెత్తాయి. ఇసుక అక్రమార్కులకు అండదండలు అందిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయి. ఓ ఇసుక వ్యాపారితో ఆయన పలుమార్లు ఫోన్‌లో సంభాషణ జరిపిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రెవెన్యూ అధికారి ఇసుక వ్యాపారితో ఫలాన సమయంలో అధికారులు రారు అని అప్పుడు ఇసుక తరలించారని ఆ వాయిస్‌లో రికార్డు ద్వారా అర్థమవుతుంది. కొంతకాలం పాటు అండదండలు ఇసుక వ్యాపారస్థుల నుండి మాములు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా ఓ ఇసుక వ్యాపారి లారీ సీజ్ చేయడంతో ఈ వాయిస్ రికార్డులు బయట పడినట్లు తెలుస్తుంది. ఈ విషయంపై ఆర్ఐని వివరణ కోరగా నాపై వచ్చిన ఆరోపణలు అవాస్తమని పేర్కొన్నారు. కొందరు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని వే బిల్లుల్లో తేదీలు మార్చి వేసి ఇసుక రవాణా చేస్తే పట్టుకున్నామని పేర్కొంటున్నారు. ఇంత కఠినంగా ఉంటామని చెబుతున్న అధికారులు నిమిషాల తరబడి పదుల సంఖ్యలో అక్రమార్కులతో ఫోన్‌లో ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందో ఉన్నతాధికారులు విచారణ జరిపి అసలు విషయాలు తేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

అసెంబ్లీలో బిల్లుల ఆమోదంపై నాయకుల సంబురాలు



నందిపేటలో సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



చేపూర్‌లో ..

నందిపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. అసెంబ్లి ఉభయ సభల్లో బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ ఉప కులాల వర్గీకరణ, రాజీవ్ యువశక్తి ద్వారా నిరుద్యోగులకు సబ్సిడీపై రుణాలు చెల్లిస్తామని మూడు బిల్లులు ప్రవేశపెట్టి ఆమోదం తెలిపినందుకు నందిపేటలో డప్పు వాయిద్యాలతో పటాకులు కాల్చారు. పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లి ఇంచార్జీ పొద్దుటూరి వినయ్ రెడ్డి ఆదేశాల మేరకు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. స్వీట్లు పంచిపెట్టారు. బిల్లులు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, సీనియర్ నాయకులు పిప్పెర సాయరెడ్డి, లోక హన్మాండ్లు, ఎండి మజారోద్దీన్, ఖదీర్, లక్ష్మినాయణ, ఎడ్డిగారి నిఖిల్, దమ్మాయి సుధాకర్, జి రాజేందర్, జావెద్, ఎస్సీ సెల్ నాయకులు తధితరులు ఉన్నారు.

వేల్పూర్: అసెంబ్లీ సమావేశాల్లో విద్య, ఉద్యోగం, స్థానిక సంస్థలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు, ఎస్సీవర్గీకరణ బిల్లు ఆమోదించినందుకు బుధవారం వేల్పూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకంచేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సారెడ్డి, నాయకులు రమణ, దామోదర్‌గౌడ్, రాజేందర్, నరేందర్, జెమ్స్ గంగారెడ్డి, బుట్టి మధు, సదానందం, చరణ్, భూమారెడ్డి, రాము, రేవంత్‌రెడ్డి, వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, తదిరతులు పాల్గొన్నారు.

పెర్కిట్: శాసన సభలో మూడు బిల్లులు బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42శాతం రిజర్వేషనలు, ఎస్సీ ఉపకులాల వర్గీకరణ, బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్‌లో బిల్లు ఆమోదం పొందిన సందర్బంగా బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగాన రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎఎంసీచైర్మన్ సాయిబాబాగౌడ్, కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, మాజీమున్సిపల్ వైస్‌చైర్మన్ మోత్కురి లింగాగౌడ్, కాంగ్రెస్ నాయకులు శాల ప్రసాద్, రాజుబాయి, జిమ్మి రవి, నవీన్, వాసన్న, విజయ్ అగర్వాల్, నటరాజ్, సత్యం, శ్రావణ్, ఆబీ, పయ్యుం, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బీసీ కులగణన బిల్లుకు ఆమోదం తెలిపి బీసీ రిజర్వేషన్ 42 శాతానికి పెంచిన సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయం వద్ద బుధవారం రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, మహేష్‌కుమార్‌గౌడ్ చిత్రపటాలకు నేతలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ కులగణన చేసి బీసీలకు జనాబా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ కులగణన నిర్వహించి బీసీలకు రిజర్వేషన్‌లు కల్పించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వల్లనే బీసీలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ బీసీల పక్షపాతి అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీలకు ఎక్కువ సీట్లు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జావిద్ అక్రమ్, నరేందర్‌గౌడ్, సంతోష్, శ్రీనివాస్, ప్రమోద్, బింగి మధు, బంటు బలరాం, రేవతి, ఉషా, అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలం చేపూర్ లో బుధవారం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. అసెంబ్లీలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ విద్యఉద్యోగ స్థానిక సంస్థలలో కల్పించడం, ఎసీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, దాసరి శ్రీకాంత్, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సాయన్న, మాజీ ఎంపీటీసీ జన్నపల్లి గంగాధర్, సురేష్, శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆలూర్ మండలం కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. బీసీలకు విద్య, ఉద్యోగాల్లో స్థానిక సంస్థలో 42శాతం రిజర్వేషన్‌లు, ఎసీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందడం పట్ల సంబరాలు నిర్వహించారు. అంబేద్కర్, మహత్మ జ్యోతి రావుపూలే, బాపు జగ్జీవన్‌రావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాలులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విజయ్, మాజీ ఎంపీపీ పస్కు నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం బీసీ ఎస్సీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ఆమోదించిందని వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీసీ, ఎస్సీ రిజర్వేషన్ బిల్లులను అసెంబ్లీలో ఆమోదించడంతో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు సంబరాఉల నిర్వహించారు. ఈ సందర్బంగా వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఎస్సీవర్గీకరణ బసీఈ రిజర్వేషన్‌ల పెంపు బిల్లులను ఏకగ్రీవంగా మోదం పొందడం జరిగిందని ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు మాదిగ ఉపకులాలకు బీసీ రిజర్వేషన్‌లు పెంచడం ద్వారా రెండు కులాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు రాజేందర్, బద్ధి సాయి, రవి, రమేష్, శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మాకూరి మహేష్, మాదిగ ప్రధానకార్యదర్శి మాకూరి గణేష్, మాదిగ గంటి నిశాంత్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు ఏకగ్రీవంగా అమలు చేసినందుకు కాంగ్రెస్ సంబరాలు

ముప్కాల్ మండల కేంద్రంలోని అంబేద్కర్, జ్యోతిరావుపూలే విగ్రహాలకు పూలమాలలు వేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్రంలోని షెడ్యూల్ కులాల ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు శాసనసభ, శాసన మండలిలో ఆమోదం పొందడం, బీసీ రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం పొందడం పట్ల ముప్కాల్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముప్కాల్ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి, డీసీసీ సెక్రెటరీ, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి చందరవి, ముప్కాల్ మాజీసర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, అబ్రర్, మల్లారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జైసంవిధాన్ సదస్సులో తాహెర్‌బిన్



సమావేశంలో పాల్గొన్న తాహెర్‌బిన్ హుందాన్, టీపీసీసీ అధ్యక్షుడు

నిజామాబాద్ అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాభవన్‌లో నిర్వహించిన జైబాపు జైభీమ్ జైసంవిధాన్ సెమినార్‌లో రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్ పాల్గొన్నారు. బుధవారం నిర్వహించిన ఈ సెమినార్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

పచ్చలనడ్కుడలో మందకృష్ణ మాదిగ
చిత్రపటానికి క్షీరాభిషేకం



పచ్చలనడ్కుడలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి దృశ్యం

వేల్పూర్, మార్చి19(ఆంధ్రజ్యోతి): ఎస్సీవర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన సందర్భంగా బుధవారం వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో మాదిగ సంఘం సభ్యులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాదిగ సంఘ సభ్యులు ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్, వేల్పూర్ మండల అధ్యక్షుడు రాజేష్, నాయకులు ఎంగంటి ప్రతాప్, రవి, నెహ్రూ, చిన్న గంగారాం, సునీల్, ప్రవీన్, శ్రీనివాస్, సంతోష్, డెవిడ్, మహేష్, శంకర్, సంజీవ్, గంగాధర్, గ్రామ మాదిగ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం

మోస్రా,మార్చి19(ఆంధ్రజ్యోతి): చందూరు మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభిస్తున్నామని సొసైటీ చైర్మన్ ప్యారం అశోక్ తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహదారులు, నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు చేతుల మీదుగా ప్రారంభిస్తున్నామని ఆయన తెలిపారు.

ట్రాక్టర్, రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత

బోధన్‌రూరల్,మార్చి19(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పోస్టాఫీస్ వద్ద పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వాహనాలపై కేసులు నమోదు చేశామన్నారు.

బోధకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు



పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్

ఆర్మూర్‌టౌన్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్ కాలనీకెనల్ కట్టపై యూపీఏసీ ఆధ్వర్యంలో ప్రజలకు బోధకాలు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. డీఎంఅండ్‌హెచ్‌వో ఆదేశాల మేరకు ఫైలేరియా నైట్‌బ్లెడ్ సర్వే నిర్వహించి 93 మందికి రక్త నమునాలను సేకరించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ శరత్‌చంద్ర, సబ్‌యూనిట్ ఆఫీసర్ సాయి, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, కృష్ణ, విజయశ్రీ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలించిన గ్రంథాలయ సంస్థ చైర్మన్



పనులు పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్

రెంజల్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్గాం గ్రామంలో 8లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి పరిశీలించారు. బోధన్ నియోజకవర్గంలో పలు గ్రామాలకు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సీసీ రోడ్డు నిర్మాణ పనుల కోసం నిధులు మంజూరు చేశారని, గ్రామంలో అవసరాలకు అనుగుణంగా రోడ్డు పనులు చేపట్టాలని సూచించారు. కాంట్రాక్టర్ సీసీ రోడ్డు పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ బోధన్ అసెంబ్లీ అధ్యక్షుడు కార్తీక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గైని కిరణ్, గ్రామ అధ్యక్షులు నీరడి రవి, సిద్ధ సాయిలు, ప్రకాష్, మేత్రి రాజు, శివ కుమార్, నగేష్, రాకేష్, హన్మాండ్లు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరి మృతి

ఎడపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాణాకలాన్ గ్రామానికి చెందిన గొలేడి శ్రీనివాస్ (42) అనే వ్యక్తి బావిలో పడి మరణించినట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాస్ కాలకృత్యాలకని బావి వద్దకు వెల్లి బావిలో పడి ఈత రాక చనిపోయాడని ప్రత్యక్షంగా వారి బంధువు అయిన మంజుల చూశారని తెలిపారు. మృతుడి తల్లి బాలవ్వ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న ఎస్సై

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేను కలిసిన కాంట్రాక్టర్లు

బోధన్‌రూరల్,మార్చి19(ఆంధ్రజ్యోతి): బోధన్ రిజిష్టర్ కాంట్రాక్ట్ అధ్యక్షుడిగా ఎన్నికైన మారయ్య బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందించి ఘనంగా సన్మానించారు. రిజిష్టర్ కాంట్రాక్టల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ శరత్ రెడ్డి, కాంట్రాక్టర్లు గుండెటి రాములు, జేమ్స్, యాదగిరి, వెంకటేశ్వర్లున్నారు.

మహంతం రైల్వే గేటు మూసివేత



మూసివేసిన మహంతం రైల్వేగేటు

నవీపేట,మార్చి19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహంతం రైల్వేగేటును అధికారులు ఇటీవల మూసివేశారు. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టడానికి ఈ గేటును మూసివేశారు. దీంతో వాహనాలను కమలాపూర్ మీదుగా మండల కేంద్రానికి దారి మళ్లించారు. ఇటీవల మండలంలోని ధర్మారం రైల్వేగేటు వద్ద సైతం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టడంతో గేటును మూసివేసిన తెలిసిందే.

ఐదు ఇసుక టిప్పర్ల పట్టివేత



అధికారులు పట్టుకున్న టిప్పర్లు

బోధన్‌రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఐదు ఇసుక టిప్పర్లను పట్టుకుని రెండు లక్షల రూపాయల జరిమానా విధించినట్లు బోధన్ ఎంవీఐ శ్రీనివాస్ తెలిపారు. ప్రత్యేక అధికారులు శ్రీకాంత్, పండరి ఆధ్వర్యంలో ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలను బుధవారం గుర్తించామన్నారు. ఇసుకను నింపుకుని ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఐదు ఇసుక టిప్పర్‌లను బోధన్ పరిసరా ప్రాంతాల్లో పట్టుకుని సీజ్ చేశామన్నారు. వీటిని బస్సు డిపో ప్రాంగణంలో నిలిపి ఉంచామని తెలిపారు. రెండు లక్షల రూపాయల జరిమాన విధించామన్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారమే టిప్పర్లు నడిపించాలన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద ఘర్షణ



బాధితులను పరామర్శిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్

ఎల్లారెడ్డి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. ఇటీవల అధికారులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందించగా, మిగతా సుమారు 40 డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఖాళీగా ఉన్నాయి. కొందరు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు వేసిన తాళాలను పగలగొట్టి చొరబడగా, ఒకరికి ఒకరు ఘర్షణకు పాల్పడినట్టు సమాచారం. అధికారుల స్పందించి ఖాళీగా ఉన్న డబుల్‌బెడ్ రూమ్‌లకు భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ల నంబర్లను వేస్తున్న ఉపాధ్యాయులు

ఆర్మూర్‌రూరల్ , మార్చి19 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి రాజ్‌గంగారాం తెలిపారు. 12 కేంద్రాలలో 1814 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 నిబంధన అమలు ఉంటుందన్నారు. అవసరమైన బందోబస్తు ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రానికి సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని ఆయన సూచించారు. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని ఆయన అన్నారు.

స్వాములకు అన్నదానం చేసిన ముస్లిం సోదరుడు



అన్నదానం చేస్తున్న అక్మల్ పటేల్

వర్ని,మార్చి19(ఆంధ్రజ్యోతి): వర్ని మండలం తగిలేపల్లి గ్రామంలో బుధవారం హనుమాన్ స్వాములకు ముస్లిం సోదరుడు దూదేకుల అక్మల్ పటేల్ అన్నదానం చేశారు. గ్రామంలో శోభాయాత్ర ప్రత్యేక పూజల అనంతరం హనుమాన్ స్వాములకు అన్నదానం ఏర్పాటు చేశారు. అక్మల్ పటేల్ సేవలపై అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

చింతకుంట పల్లె ప్రకృతి వనానికి నిప్పు



పూర్తిగా కాలిపోయిన చెట్లు

మోస్రా,మార్చి19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట గ్రామ శివారులోని శాంతినగర్ కాలనీ పక్కన గల ప్రకృతివనంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. ఎవరో నిప్పు పెట్టారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పల్లె ప్రకృతి వనాన్ని కాపాడాలని గ్రామ పంచాయతీ కార్యదర్శిని కోరారు.

ఆలయంలో భవన నిర్మాణానికి భూమిపూజ

మోర్తాడ్, మార్చి19(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్‌పల్లి గ్రామంలో శివాలయంలో నిర్మిస్తున్న నూతన ధర్మశాల భవనానికి కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ రూ.13లక్షలు ప్రత్యేక నిధులను మంజూరు చేయించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యాల రాములు, గడ్డం అనిల్, లక్క రంజిత్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అడ్వాల మనోజ్, మందం దేవేందర్, నవీన్, మెట్టు శ్రీనివాస్, లక్క గంగాధర్, పుప్పాల లింగారెడ్డి, లింబాన్న, సత్యం, చిన్నన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే
విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన

● రిటైర్డు ఐఏఎస్ అధికారి చిరంజీవులు



చిరంజీవులును సన్మానిస్తున్న హెచ్ఎం

వేల్పూర్,మార్చి19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య బోధన ఉంటుందని రిటైర్డు ఐఎఎస్ అధికారి చిరంజీవులు అన్నారు. బుధ వారం వేల్పూర్ మండలం మోతె గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, రిటైర్డు ఐఎఎస్ అధికారి చిరంజీవులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠ శాలల్లో అన్ని రకాల శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ద్వారా విద్యబోధన ఉం టుందని దీనిని విద్యార్థులు ఉపయోగించుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వైద్యగణేష్, పీడీ సురేష్, ఉపాధ్యాయులు, పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

'యువవికాస్ పథకాన్ని వినియోగించుకోవాలి'

భీమ్‌గల్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువవికాస్ పథకాన్ని అర్హులైన నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకోవాలని భీమ్‌గల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్ది అవినాష్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఈ అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీఎం ప్రతిష్టాత్మకంగా ఈ పథకం ప్రారంభించారని, రాష్ట్రంలో రూ.5లక్షల మందికి ఆరువేల కోట్ల రాయితీతో ఒక్కో లబ్ధిదారునికి రూ.4లక్షల వరకు రుణం ప్రభుత్వం అందిస్తుందని కనక నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరుతో రూ.6 కోట్లతో రాష్ట్రంలోని ఐదు లక్షల మంది యువతకు స్వయం ఉపాధి అవకాశం కల్పిస్తుందని తెలిపారు.

ఒకరికి రెండు రోజుల జైలు

ఆర్మూర్‌టౌన్ మార్చి19(ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన పెర్కిట్‌కు చెందిన జె.శివకుమార్‌కు బుధవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. ఇటీవల ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా అతిగా మద్యం సేవించి పట్టుబడడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా శివకుమార్‌కు రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్టు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

సీడ్స్ కంపెనీ సీజ్

ఆర్మూర్‌టౌన్ మార్చి19(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని అంకాపూర్ రోడ్‌లో మారుతి సీడ్స్ కంపెనీ పన్ను చెల్లించనందున బుధవారం మున్సిపల్ అధికారులు సీజ్‌చేశారు. రెండేళ్లుగా పన్ను చెల్లించకపోవడంతో సుమారు రూ.70 వేల బకాయి ఉండడంతో సీడ్స్ కంపెనీ యజమానిదారుడు రాంచందర్ చెల్లించకపోవడంతో సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అయ్యూం, వార్డు ఆఫీసర్‌లు యుగేందర్, చక్రధర్, రాజేష్, వినిత్, నితిన్, డి.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలి

● ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్ మార్చి19(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక వాహనదారుడు ట్రాఫిక్ నియమలు పాటించాలని ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం మున్సిపల్ పరిధిలో మామిడిపల్లిచౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతీ వాహనదారున్ని తనిఖీలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. ఆయన వెంట ట్రాఫిక్ సీఐ ఓ.డి.రమేష్, ఎస్సై రఘుపతి, పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట : మండలంలోని యంచలో బుధవారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన ధృవపత్రాలు లేని వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. వాహనదారులు తమ వెంట సరైన ధృవపత్రాలను కలిగి ఉండాలని పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వినయ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఫటా..ఫట్...

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

● సాయిరాం, ఎంపీడీవో, ఆర్మూర్



ఆంధ్రజ్యోతి: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నారా?

ఎంపీడీవో: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. మిషన్ భగీరథ నీరు వస్తుంది. రాని పక్షంలో బోర్లకు మరమ్మత్తులు చేసి సిద్ధంగా ఉంచాం.

ఆంధ్రజ్యోతి: ఆలూర్ మండల పరిషత్ కార్యాలయం ఎప్పుడు అందుబాటులోకి వస్తుంది?

ఎంపీడీవో: ఆలూర్ మండల పరిషత్ కార్యాలయానికి భవనాన్ని సిద్ధం చేశాం. సిబ్బందిని కూడా కేటాయించాం. త్వరలోనే సేవలందుతాయి.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని నిర్మిస్తున్నారు?

ఎంపీడీవో: ప్రస్తుతానికి కోమన్‌పల్లిలో 15, మిర్దాపల్లిలో పది ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాం.

ఆంధ్రజ్యోతి: ఉపాధి హామీలో ఏఏ పనులు చేపడుతున్నారు?

ఎంపీడీవో: ఉపాధి హామీలో ఫిష్‌పాండ్ భూ అభివృద్ధికి మట్టిరోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు.

ఆంధ్రజ్యోతి: నిరుద్యోగ యువతకు ఏలాంటి పథకాలు ఉన్నాయి?

ఎంపీడీవో: ప్రస్తుతం రాజీవ్ యువవికాసం పథకంలో అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నాం.

● (ఆర్మూర్ రూరల్ ఆంధ్రజ్యోతి)

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్‌లో ద్వితీయ స్థానం సాధించిన గంగాధర్, జాలయ్య


బహుమతులతో క్రీడాకారులు

సుభాష్‌నగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా సాంస్కృతిక ఉత్సవాల్లో జిల్లాకు చెందిన గంగాధర్‌గౌడ్, జాలయ్య బాడ్మింటన్ డబుల్స్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. సూర్యపేట జిల్లా కోదాడలో మార్చి 16 నుంచి 18 వరకు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఈ పోటీలో ద్వితీయ స్థానం నిలి చిన విజేతలను బ్యాడ్మింటన్ అధ్యక్షుడు కర్నాటి వాసు, కార్యదర్శి కిరణ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి సాయిరెడ్డిలు అభినందించారు.

అండర్-14 ఫుట్‌బాల్ పోటీలో జిల్లా మొదటి స్థానం

సుభాష్‌నగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలలో జిల్లా జట్టు మొదటి స్థానంలో నిలిచినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి తెలిపారు. వనపర్తిలో జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీలో బాలికల జట్టు అద్భుత ప్రదర్శనతో మొదటి స్థానం సాధించినట్లు తెలిపారు. మొదటి రౌండ్‌లో ఖమ్మం జట్లపై 5-0, హైదరాబాద్ 4-0 ఘన విజయాలు సాధించగా రంగారెడ్డి జిల్లా జట్టు టైతో సరిపెట్టుకుంది. సెమీఫైనల్‌లో మహబూబ్‌నగర్ జట్టుపై 3-2 తేడాతో గెలిచి ఫైనల్‌లో హైదరాబాద్ జట్టుపై 2-0తో గెలిచి ఛాంపియన్‌గా నిలిచింది. ఇందులో అత్యంత ప్రతిభకనబర్చిన హరిణియాదవ్, ఎం.నక్షత్ర, మాధవిలను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు.


నాగిరెడ్డిపేటలో కళకళలాడుతున్న పచ్చని వరి పంట పొలాలు

భూమికి పచ్చాని రంగేసినట్టు!

నాగిరెడ్డిపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భూమికి పచ్చని రంగు వేసినట్టు కనిపిస్తున్న ఈ అందమైన దృశ్యం నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని జగ్గ చెరువు కింద కనువిందు చేస్తోంది. అసలే వేసవి కాలం ఎండలు దంచికొడుతున్న తరుణంలో ఎండ తీవ్రతతో మోడు వారి ఆకులు రాలిన చెట్లు అక్కడక్కడ దర్శనమిస్తుంటే ఇంతటి ఎండలో కూడా చెరువు క్రింద ఉన్న పచ్చని వరి పొలాల సుందరమైన దృశ్యం రహదారి వెంట వెళ్లే వారందరినీ ఆకట్టుకుంటోంది. ఈ యాసంగిలో పోచారం ప్రాజెక్టు ద్వారా నాగిరెడ్డిపేట మండలంలోని సాగు భూములకు నీరు అందిస్తుండడంతో మండలంలోని వివిధ గ్రామాల శివారు ప్రాంతాలు ఇలాగే పచ్చని వరి పంట పొలాలు కళకళలాడుతున్న సుందర మైన దృశ్యాలు దర్శనమిస్తూ ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.


కుంటకట్టపై చెత్తతో నిండి ఉన్న గ్రామ పంచాయితీ ట్రాక్టర్


డంపింగ్ యార్డుగా దర్శనమిస్తున్న వాటర్ ట్యాంకు పరిసరాల ప్రాంతం

ఆంధ్రజ్యోతి ఫోకస్


మొరాయించిన చెత్త సేకరణ ట్రాక్టర్ ఇదే..

కలెక్టర్ గారు.. జర మా గ్రామాన్ని చూడరూ!?

● ఆరు నెలలుగా మొరాయించిన చెత్త ట్రాక్టర్ ● పట్టింపు లేని ప్రత్యేక అధికారి ● తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శి ● డంపింగ్ యార్డు నిర్మించినా వాటర్ ట్యాంక్ వద్దే చెత్తాచెదారం

నిజాంసాగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలో ప్రత్యేక పాలన గాడి తప్పింది. గ్రామపంచాయతీల పాలకవర్గం ఏడాది కిందటనే కాల పరిమితి ముగిసిపోయింది. అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామ పంచాయతీలు కొనసాగుతున్న గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారుల పనితీరు సక్రమంగా లేకుండా పోయాయి. పంచాయతీలను పర్యవేక్షించాల్సిన ఎంపీడీవో పంచాయతీ విస్తీర్ణ అధికారులు తమకే ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారుల పాలనను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన జిల్లా డివిజన్ పంచాయతీ అధికారులు పర్యవేక్షించిన దాఖలాలు కొసమెరుపు. నిజాంసాగర్ మండలం జక్కాపూర్ గ్రామపంచాయతీలో చెత్తను సేకరించే ట్రాక్టర్ దాదాపు 8 నెల కిందటనే చెడిపోయి చెత్తతోనే కుంట కట్టపై మొరాయిం చింది. దీనిని మరమ్మతులు చేయించి ట్రాక్టర్‌లో ఉన్న చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని ఆలోచన గ్రామపంచాయతీ కార్యదర్శి పంచాయతీ ప్రత్యేక అధికారికి లేకపోవడం పట్ల గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. గ్రామపంచాయతీ గత ప్రభుత్వం ట్రాక్టర్లను కొనుగోలు చేసి ఇచ్చింది. ఈ ట్రాక్టర్‌తో గ్రామంలోని పురవీధుల గుండా చెత్తను సేకరించి డంపింగ్ యార్డులో వేసేందుకు లక్ష్యం కాగా అధికారులు ప్రభుత్వ లక్ష్యాన్ని తుంగలో తొక్కారు. 8 నెలల కింద ట్రాక్టర్ చెడిపోయిన ఈ ట్రాక్టర్‌ను మరమ్మతులు చేయించాలని ఆలోచన లేకపోవడం విశేషం. పంచాయతీ కార్యదర్శి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చెత్తతో ట్రాక్టర్ గ్రామానికి వచ్చిపోయే అధికారులకు ప్రజా ప్రతినిధులకు స్వాగతం పలుకుతుంది. మండల పంచాయతీ అధికారికి మొరాయించిన ట్రాక్టర్ కనపడటం లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. గ్రామంలో చెత్త సేకరణ చేయకపోవడంతో గ్రామస్థులు చెత్తను వాటర్ ట్యాంకు వద్దనే పారవేస్తున్నారు. దీంతో వాటర్ ట్యాంక్ పరిసరాల ప్రాంతమంతా డంపింగ్ యార్డుగా దర్శనమిస్తున్నా పట్టించుకునే పాపాన పోవటం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి గ్రామంలో డంపింగ్ సేకరణతో పాటు మొరాయించిన ట్రాక్టర్‌ను మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అడవి మామిడిపల్లి టు ఆర్మీ

● ఆర్మీలో చేరి దేశసేవ చేస్తున్న యువకులు ● యువతకు ఆదర్శంగా నిలుస్తున్న మామిడిపల్లి వాసులు


అడవి మామిడిపల్లి గ్రామ ముఖచిత్రం



అడవి మామిడిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

ఆర్మూర్‌రూరల్, మార్చి19(ఆంధ్రజ్యోతి): సరిహద్దు సేవంటే సాహసమే. దేశభద్రత నా బాధ్యత అంటు దేశరక్షణలో పాలు పంచుకుంటున్నారు అడవి మామిడిపల్లి యువకులు బార్డర్‌లో సైనికులుగా ఉంటూ భారత్‌కు రక్షణగా నిలుస్తూ దేశభక్తిని నిరూపించుకుంటున్నారు. మాక్లూర్ మండలంలోని అడవిమామిడిపల్లి నిజామాబాద్, ఆర్మూర్ మార్గంలోని 63వ జాతీయ రహదారిపై ఉంది. ఆ గ్రామ యువకులు ఇంటర్ పూర్తి కాగానే దేశరక్షణకు నడుం బిగించి ఆర్మీలో చేరుతున్నారు. ఒకరిని చూసి మరొకరు ఇలా గ్రామం నుంచి 25 మంది యువకులు సైన్యంలో చేరి దేశసరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్నారు.. అంతేగాకుండా గతంలో సైన్యంలో పని చేసి రిటైర్డు అయిన వారు ఆరుగురు ఉన్నారు. వీరు పదవి విరమణ అనంతరం వివిధ కొలువుల్లో స్థిరపడ్డారు.

యువతకు ఆదర్శం..

ఊరి పేరు ఆడవి మామిడిపల్లి అయినప్పటికీ ప్రస్తుతం దేశసైనికుల గ్రామంగా పేరుగాంచింది. 25 ఏళ్ల క్రితం ఈ గ్రామం నుంచి పలువురు యువకులు ఆర్మీలో చేరడంతో వారిని ఆదర్శంగా తీసుకొని మిగతా యువకులు సైతం ఆర్మీలో చేరి దేశ సేవలో తమవంతు కృషి చేసేందుకు ముందు నిలుస్తున్నారు. ఉత్తరాదిన దేశ సరిహద్దుల్లో ఒక్కోసారి మైనస్ 25డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది. ఎముకలు కొరికే చలిలో రాత్రనక, పగలనక విధులు నిర్వహించాల్సి వస్తుంది. ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలి. సైనికులకు ఏడాదికి రెండు సార్లు సెలవులు ఉంటాయి. ఐదు నెలల కోసారి స్వగ్రామానికి వచ్చి వెళ్తుంటారు. ఎంత దూరాన, ఎంత చలిలో ఉన్న దేశ సేవ ముందు అన్ని బలాదూర్ అని వారంటున్నారు.

పోలీస్ శాఖలో సైతం..

అడవి మామిడిపల్లి గ్రామం నుంచి ఆర్మీలోనే కాకుండా పోలీస్ శాఖలో సైతం పలువురు కొలువులు సాధించి సేవలందిస్తున్నారు. సుమారు 20మంది వరకు పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. అంతేగాకుండా విద్యశాఖ, రోడ్డు రవాణా సంస్థతో పాటు పలు సంస్థల్లో యువకులు ఉద్యోగాలు చేస్తూ రాబోయే యువతరాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

దేశసేవ చేయడంలో సంతృప్తి ఉంది..

● మావురి రాజేష్, (ఆర్మీజవాన్), అడవి మామిడిపల్లి



విద్యార్థి దశ నుంచే ఆర్మీలో చేరాలన్న కోరిక బలంగా ఉండేది. ఇంటర్ పూర్తి కాగానే డిగ్రీలో చేరినప్పటికీ నా మనసంతా ఆర్మీ వైపే ఉండడంతో ఆర్మీ రిక్రూట్ మెంట్‌కు వెళ్లి ఎంపికయ్యాను. గత తొమ్మిదేళ్లుగా ఆర్మీలో పని చేస్తున్నాను. మొదట పంజాబ్, కాశ్మీర్ రాష్ట్రాల్లో పనిచేసి ప్రస్తుతం సిక్కింలో విధులు నిర్వహిస్తున్నాను. దేశ సేవ చేయడంలో సంతృప్తి ఉంది. ఇంత కంటే ఇంకెం కావాలి.

గొల్లపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

రామారెడ్డి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామంలో బుధవారం ఐదు లక్షల సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండల నాయకుడు కిష్ట యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు నేతృత్వంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం గ్రామంలో దశలవారీగా సీసీ రోడ్డు పనులు ప్రారంభించడం జరుగుతుందని వివరించారు. పెద్దలు యోగులు తేడా లేకుండా అభివృద్ధి కోసం కలిసికట్టుగా అభివృద్ధి పనులు ముందుండాలని పలు సలహాలు, సూచనలు, పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మహేష్ యాదవ్, నాయకులు రాజేందర్ , రాజు, ప్రభాకర్, రాజ నర్సు, మర్రి మధు, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

ఆర్మూర్‌రూరల్ /పెద్దకొడప్‌గల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రేపటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలు విద్యార్థులు ప్రశాంతంగా రాయాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

- పరీక్ష కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలి. హాల్ టికెట్ నెంబర్ ప్రకారం ఏ రూంలో నెంబర్ కేటాయించింది ఆవరణలో నుంచే జాబితాలో చూసుకోవాలి.
- ఇంటి నుంచి బయలుదేరే ముందు పరీక్ష రాయడానికి అవసరమైన వస్తువులన్నీ ఉన్నయా లేవా ఒకసారి సరి చూసుకోవాలి. (పెన్నులు, పెన్సిళ్లు, స్కెల్, రబ్బరు, షార్ప్‌నర్ అన్ని ఉండేలా చూసుకోవాలి)
- మీ సీటులో ప్రశాంతంగా కూర్చోవాలి. బార్ కోడింగ్ షీట్ ఇచ్చాక దాని మీద ఉన్న మీ వివరాలు సరి చూసుకోవాలి. ఎటువంటి కొట్టివేతలు లేకుండా మేయిన్ ఆన్సర్ షీట్ నెంబర్ మీడియం సరిగ్గా రాయాలి
- ప్రశ్నాపత్రాలు పంపిణీ చేశాక దానిని రెండుసార్లు పూర్తిగా చదివి ప్రతీ ప్రశ్నను అర్థం చేసుకోవాలి. కొంత మంది ప్రశ్నలు పూర్తిగా చదవకుండానే ఒకదానికి బదులు మరో జవాబు రాస్తారు.
- పరీక్ష పేపర్ ఏదైనా సమయపాలన ముఖ్యం. కాబట్టి సులువైన ప్రశ్నలు పెద్దప్రశ్నలకు ముందుగా సమాధానం రాస్తే సమయం కాలిసి వస్తుంది. అవసరమైతే అన్ని సమాధానాలు రాసిన తర్వాత చివరలో ఎక్స్‌ట్రా ప్రశ్నాలకు సమాధానాలు రాయాలి.
- మంచి చేతిరాతతో అసిస్టెంట్ ఎగ్జామినర్‌ను ఆకర్షించే విధంగా మంచి మార్కులు పొందవచ్చు. లెఫ్ట్ టాప్ రైట్ బాటం మార్జిన్‌లను రెండు లైన్‌లతో గీయాలి. ప్రతీపేజీలో 18 వరుసలతో సమాధానాలు రాస్తే ఆకర్షణీయంగా ఉంటుంది.
- మీరు తీసుకునే అదనపు షీట్లు, బిట్ పేపర్ మ్యాప్‌ల మీద మెయిన్ ఆన్సర్, బుక్‌లెట్ నెంబర్ సరిగ్గా రాయాలి. కష్టమైన ప్రశ్నతో మొదలు పెట్టాలంటే మెదడు చురుగ్గా పనిచేయక సమయం వృథా అవుతుంది.
- అక్షరాలను అర్థం కాకుండా రాయకూడదు. అక్షరాలు సరిగ్గా అర్థమయ్యేలా పెద్దగా రాయాలి. అవసరమైన చోట కామలు, ఫుల్ స్టాప్‌లు పెడుతూ కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి.
- మార్కులను బట్టి జవాబులు రాయాలి.
- పది నిమిషాలు టైం మిగిలేలా చూసుకుంటే రాసినవి తిరిగి చూసుకోవచ్చు. ఎక్కడైనా తప్పులు రాస్తే సరిచేసే వీలుంటుంది. చక్కగా వరుసలో పెట్టి జాగ్రత్తగా ట్యాగ్ కట్టండి.
- బిట్స్ (అబ్జెక్ట్) ఆన్సర్ చేయడానికి సమయాన్ని సరిపోయేలా చూసుకోవాలి. ప్రశ్నలను పూర్తిగా చదివి అర్థం చేసుకొని జవాబులు రాయాలి.
- పరీక్ష ముందు రోజు మరి రాత్రి వరకు నిద్ర పోకుండా ఉండకూడదు. పరీక్ష ఉన్న రోజు ఉదయాన్నే లేచి ముఖ్యమైన అంశాలను రివిజన్ చేసుకోవాలి.
- పరీక్ష రాసేందుకు వెళ్లే సమయంలో కాలి కడుపుతో వెల్లకూడదు. ఏదో ఒక అల్పాహారం తీసుకుని వెళ్లాలి.
- పరీక్షలకు వెళ్లే సమయంలో పరీక్ష అట్ట, పెన్నులు, హాల్ టికెట్, కంపాక్స్ బాక్స్ మొదలైనవి ఖచ్చితంగా తీసుకెల్లాలి.
- పరీక్ష హాల్‌లోకి అనుమతించిన వెంటనే లోపలికి వెల్లి హాల్ టికెట్ నెంబర్ చూసుకుని కూర్చోవాలి.
- పరీక్ష హాల్‌లో ఓఎంఆర్ షీట్ ఇవ్వగానే ముందుగా మర్చి పోకుండా హాల్ టికెట్ నెంబర్‌ను తప్పులు లేకుండా సరిగ్గా రాసు కోవాలి. ఈ విషయంలో ఏదైనా సందేహాలుంటే ఇన్విజిలేటర్‌ను సంప్రదించాలి.
- పరీక్ష హాల్‌లో ప్రశ్నపత్రం ఇవ్వగానే తొందర పడకుండ మొత్తం ప్రశ్నలను ఒకసారి చదివి, ఇందులో ఏవి సులువో, ఏవి కష్టతరమో గుర్తెరిగి, ముందుగా సులువు ఉన్న వాటికి జవాబులు రాయండి.
- ప్రశ్నలకు సమాధానాలు రాసే సమయంలో అక్షరాలు మరీ దగ్గర దగ్గరగా ఉండకుండా, దూరం దూరం ఉండకుండ, అక్షరాలు పెద్దవిగా, చిన్నవిగా ఉండకుండ చూసుకోవాలి.
- మెయిన్ ఆన్సర్ బుక్‌లెట్‌లో ప్రశ్నలు అన్ని రాసిన తర్వాత చివరికి ది ఎండ్ అని రాయాలి.

కు.ని. ఆపరేషన్ గదిలో విద్యుత్ సమస్య

● నిలిచిపోయిన ఆపరేషన్లు ● ఇబ్బందులు ఎదుర్కొంటున్న దూర ప్రాంతాల రోగులు


మద్నూర్ ఆసుపత్రిలో ఆపరేషన్ గదిలో ఉన్న విద్యుత్ సమస్య


కు.ని. కోసం వచ్చిన మహిళ సాత్విక


ఆపరేషన్ కోసం మహిళల ఎదురుచూపు


మద్నూర్ ఆసుపత్రి వద్ద రోగుల సందడి

మద్నూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు పేరుగాంచిన మద్నూర్ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో విద్యుత్ సమస్యతో ఆపరేషన్లు నిలిపివేసినట్లు వైద్య సిబ్బంది వెల్లడించారు. మద్నూర్ మండల కేంద్రంలోని 30 పడకల వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో వారం వారం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను నిర్వహిస్తారు. 2023 ఆగస్టు నుంచి ఇప్పటి వరకు 300లకు పైగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించారు. మద్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్లు చేస్తారంటూ ప్రచారం కావడంతో దూర ప్రాంతాల నుంచి మహిళలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం ఇక్కడికి వస్తుంటారు. ప్రతీ మంగళవారం ఆపరేషన్ చేసుకునే వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, బుధవారం పరీక్షలకు సంబంధించి రిపోర్టు వచ్చిన తరువాత గురువారం అర్హులైన వారికి కు.ని. ఆపరేషన్ చేస్తుంటారు. అటువంటిది మంగళవారం కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం వచ్చిన మహిళలకు ఈ వారం ఆపరేషన్లు చేయడం లేదంటూ వైద్య సిబ్బంది తెలపడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యుత్ సమస్య ఉందని, ఆపరేషన్ చేసే సమయంలో రోగికి అవసరమైన విద్యుత్ సరఫరాలో వోల్టేజీ రావడం ఏసీ పని చేయకపోవడంతో రోగికి ఇబ్బందులు ఎదురవుతాయని అందుకు గాను ఈ వారం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను నిలిపివేసినట్లు తెలిపారు. దీంతో దూర ప్రాంతాల నుంచి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం వచ్చిన మహిళలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యవసర సమయాలలో పని చేసే విద్యుత్ సమస్య ఆసుపత్రిలో నెలకొనడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ గోపికృష్ణను వివరణ కోరగా ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని గదుల్లో విద్యుత్ సరఫరా సరిగ్గా ఉందని, కు.ని. ఆపరేషన్ చేసే గదిలో మాత్రమే విద్యుత్ సరఫరాలో వోల్టేజీ వస్తుందని దీనికి వైరింగ్ ప్రాబ్లం ఉందని తమ సిబ్బంది ఆసుపత్రి వారికి తెలిపినట్లు వెల్లడించారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగినప్పుడు బాధితునికి అంబులెన్స్‌లో ముందుగా మద్నూర్ ఆసుపత్రికే తరలిస్తుంటారు. ఆ సమయంలో ఆసుపత్రిలో ఉన్న ఆపరేషన్ గదిలో చికిత్స చేయాల్సి ఉంటుంది. అప్పుడు విద్యుత్ సమస్య ఇలాగే ఉంటే రోగి ప్రాణానికే ముప్పు ఏర్పడవచ్చని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సమస్యను ఆసుపత్రి సిబ్బంది ట్రాన్స్‌కో సిబ్బంది వెంటనే పరిష్కరించి రోగులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని కోరుతున్నారు.

● దూరం నుంచి వచ్చాం సారూ

మద్నూర్ ఆసుపత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు వారం వారం జరుగుతాయని తెలిసి బీర్కూర్ మండలం రాంపూర్ నుంచి వచ్చాం ఇక్కడికి వచ్చిన తరువాత ఆపరేషన్లు చేయడం లేదని తెలిసింది.

- సాత్విక, రాంపూర్

● ఆపరేషన్లు ఈ వారం చేయడం లేదు?

వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో ఆపరేషన్ కోసం వస్తే ఈ వారం చేయడం లేదని తెలిసింది. ముందుగా తెలిసి ఉంటే ఇంత దూరం వచ్చే వారిమి కాదు. మళ్ళీ వారం వచ్చేవారిమి.

- సుమ, బస్వాపూర్

బీరప్ప ఆలయంలో గ్రానైట్ పనులు పూర్తి

భిక్కనూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బీరప్ప ఆలయంలో గ్రానైట్ పనులు పూర్తిచేశామని బీజేవైఎం జిల్లా నాయకులు రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రమేష్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుమ సంఘం ప్రతినిధులకు ఎమ్మెల్యే రమణారెడ్డి ఇచ్చిన హామీ మేరకు గ్రానైట్ పనులను పూర్తిచేసి మాట నిలబెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

భిక్కనూరులో తైబజార్ వేలం పాట వాయిదా

భిక్కనూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తైబజార్ వేలం కార్యక్రమాన్ని వాయిదా వేశామని భిక్కనూరు గ్రామపంచాయతీ ఈవో మహేష్‌గౌడ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ గురువారం నిర్వహించాల్సిన తైబజార్ వేటం ఎమ్మెల్యే రమణారెడ్డితో పంచాయతీ కార్యదర్శుల కో-ఆర్డినేషన్ సమావేశం నేపథ్యంలో వాయిదా చేశామన్నారు. కార్యక్రమాన్ని మరల నిర్వహించే తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఈ సందర్భంగా ఈవో తెలిపారు.

రేపు తైబజార్ వేలం పాట

దోమకొండ: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు తైబజార్ వేలంపాటను గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి యాదగిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచుకునే వారు గ్రామ పంచాయతీ కార్యాలయానికి సకాలంలో చేరుకోవాలని సూచించారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ సలహాదారులు

బాన్సువాడ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణ కేంద్రంలోని తన నివాసంలో బాన్సువాడ నియోజకవర్గంలోని 15 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. బాన్సువాడ మండలంలో ఐదు మంది లబ్ధిదారులకు రూ.67,500 బాన్సువాడ మున్సిపాలిటీ ఒక్క లబ్ధిదారునికి సీఎంఆర్ఎఫ్ రూ.60వేలు, బీర్కూర్ మండలం నలుగురు మంది లబ్ధిదారులకు రూ. 1,25,500, నసురుల్లాబాద్‌లో ఐదుగురు మందికి లబ్ధిదారులకు రూ.2,20,000 మొత్తం నియోజకవర్గంలో 15 మంది సీఎం ఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.4,73,000 పంపిణీ చేశారు.

'ప్రతి విద్యార్థికి అన్ని భాషలపై అవగాహన ఉండాలి'

సదాశివనగర్,మార్చి 19(ఆంధ్రజ్యోతి): దేశంలోని అన్నిభాషలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ రాజారెడ్డి అన్నారు. బుధవారం సదాశివనగర్‌లో పీఎంశ్రీలో భాగంగా ఏక్‌భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ గైడ్ టీచర్ రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి'



డీఎల్‌పీవోను సన్మానిస్తున్న సత్యనారాయణరెడ్డి

బిచ్కుంద,మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా పరిష్కారం చూపాలని డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం బిచ్కుంద గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి ఆదాయ, వ్యయాల వివరాలు రికార్డులు పరిశీలించారు. గ్రామపంచాయతీలలో ప్రజాప్రతినిధుల పాలన లేనందున ప్రత్యేకాధికారుల ద్వారా పల్లె, పట్టణాలలో మౌలిక సదుపాయాల కల్పనకు శ్రద్ధచూపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో కృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, సిబ్బంది మహేష్, వీరేశం పాల్గొన్నారు.

ఎమ్మార్పీకి సన్మానం

రామారెడ్డి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి విద్యాశాఖ ఎమ్మార్పీగా సేవలందించిన మహమూద్‌కు గురుబ్రహ్మ అవార్డును అందించారు. మదర్‌థెరీసా సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ వైజాగ్ ఆధ్వర్యంలో బుధవారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పోస్టుద్వారా వచ్చిన అవార్డును జడ్పీటీసీ రామ్‌రెడ్డి కాంప్లెక్స్ హెచ్ఎం ఆనంద్ చేతుల మీదుగా మెమోంటోను అందుకున్నారు. అవార్డు అందుకున్న సీఆర్పీ మహమూద్‌ను ఘనంగా శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీపాద్, శ్రీనివాస్, గంగయ్య, లావణ్యరాణి, రవీందర్ రెడ్డి, చంద్రమూర్తి, రవీందర్ గౌడ్, స్రవంతి, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

భిక్కనూరులో ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు

భిక్కనూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు శంకర్, తుడుంజీవన్, లక్ష్మణ్, రాజు మాట్లాడుతూ తాము గత 30 సంవత్సరాలుగా మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ పోరాటాలు, ఉద్యమాలు చేశామన్నారు. తమ చిరకాల కోరిక ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడి అసువులు బాసిన అమరవీరులకు దీనిని అంకితం ఇచ్చామన్నారు. అనంతరం పెద్దఎత్తున టపాసులు కాల్చుతూ సీఎం రేవంత్‌రెడ్డి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఐదువేల ఆర్థిక సహాయం

ఎల్లారెడ్డి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగమయిపల్లి గ్రామానికి చెందిన గంపలకుమార్ అనారోగ్యంతో బాధపడుతూ ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు తెలిపారు. ఆయనతో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకట్రాంరెడ్డి మాజీ జడ్పీటిసి సామిల్ తదితరులు ఉన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బీబీపేట,మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కన్యకపరమేశ్వరి విగ్రహాప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు, మండలంలోని భక్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు అభిషేక కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. కొందరు కుంకుమ పూజలతో అమ్మవారి మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

రేషన్ బియ్యం స్వాహాపై విచారణ



విచారణ చేపడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ షరీఫ్

బీర్కూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో గల 7వ నెంబర్ రేషన్‌షాపులో సదరు డీలర్ 14.46 క్వింటాళ్ళ బియ్యం స్వాహా చేసినట్లు గ్రామస్తులు పౌరసరఫరా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ షరీఫ్ బుధవారం కిష్టాపూర్ గ్రామానికి చేరుకుని రేషన్‌షాప్‌లో విచారణ చేపట్టారు. రేషన్ షాపునకు ఎంత స్టాక్ వచ్చింది. ఇప్పటి వరకు ఎంత మేర పంపిణీ చేశారు. షాపులో ఎంత నిల్వ ఉంది అనే వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మార్చి నెలలో 68, 34 క్వింటాళ్ళ బియ్యం సరఫరా అయిందని, గత నెల 17.46 క్వింటాళ్ళ బియ్యం నిల్వ ఉందని మొత్తం 85.80 క్వింటాళ్ళ బియ్యం నిల్వ ఉందన్నారు. ఇందులో నుంచి 71.52 క్వింటాళ్ళ బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేశారని తెలిపారు. షాపులో ఇంకా 14.28 క్వింటాళ్ళ బియ్యం నిల్వఉండాల్సి ఉండగా 10 క్వింటాళ్ళ బియ్యం నిల్వఉందని తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల 4.28 క్వింటాళ్ళ బియ్యం నిల్వ ఉన్నట్లు 2022 నుంచి ఆన్‌లైన్‌లో చూపుతుందన్నారు. డీలర్ డీఎస్‌వో దృష్టికి తీసుకువెళ్లారన్నారు. రేషన్‌షాపులో ఎలాంటి తప్పిదలు జరగలేదన్నారు. రికా ర్డుల ప్రకారం అన్ని సరిగ్గానే ఉన్నాయని చెప్పారు.

ఉపాధి పనులు రైతులకు ఉపయోగపడే విధంగా చేపట్టాలి

● క్వాలిటీ కంట్రోల్ జిల్లా అధికారి రాఘవన్

తాడ్వాయి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో జిల్లాలో చేపట్టే ఉపాధిహామీ పనులన్నింటినీ రైతులకు ఉపయోగపడే విధంగా, అలాగే నాణ్యతతో కూడిన పనులను చేపట్టాలని జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి రాఘవన్ అన్నారు. బుధవారం ఆయన తాడ్వాయి మండలంలోని ఎర్రపహాడ్, ఎండ్రియాల్, కన్కల్ గ్రామంలో చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే పండ్ల తోటల పెంపకం పనులు ఎక్కువగా చేపట్టాలని అన్నారు. రైతులకు ఇది ఉపయోగపడడంతో పాటు జీవనోపాధి పెరుగుదలకు తోడ్పడుతుందన్నారు. పండ్లతోటల పెంపకం, ఇంకుడు గుంతల పండ్ల చేపట్టేటప్పుడు నిబంధనలకు అనుసరించి చేపట్టాలన్నారు. అనంతరం ఎండ్రియాల్ గ్రామంలో చేపట్టిన చెరువు పూడికతీత పనులకు సంబంధించి రైతులకు చెరువుమట్టి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. రైతులు చెరువు మట్టిని తీసుకెళ్లే రైతులకు సంబంధించి వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఎర్రపాడు గ్రామంలో చెక్‌డాం నిర్మాణం సంబంధించి పని ప్రదేశాన్ని తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ క్షేత్ర సహాయకులు ఉపాధి హామీ సిబ్బంది అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని అన్నారు. క్షేత్ర సహాయకులు ఉపాధి సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట జేక్యూసీ విప్లవ కుమార్, ఏపీఓ కృష్ణ గౌడ్, మహిపాల్, స్వామి ఉన్నారు.



పండ్ల తోటను పరిశీలిస్తున్న జిల్లా అధికారి

విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ



ఎగ్జామ్ ప్యాడ్స్‌తో విద్యార్థులు

బీర్కూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు బుధవారం ఎగ్జామ్ ప్యాడ్స్ ఉచితంగా పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థులు తమ సొంత డబ్బులతో ఎగ్జామ్ ప్యాడ్స్ కొనుగోలు చేసి 148 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో ఎంఈవో వెంకన్న, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శివరాం, ఉపాధ్యాయులు రాధాకృష్ణ, క్యాకయ్య, ప్రవీణ్‌కుమార్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలోని పదోతరగతి పరీక్షలు రాస్తున్న 350 మంది విద్యార్థులకు మనకోసం మనం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పట్లోళ్ల కిషోర్ కుమార్ తన స్వంత ఖర్చుతో పరీక్ష ప్యాడ్, సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు అల్లాపూర్‌కుషాల్, ప్రధానకార్యదర్శి పుట్ట శ్రీనివాస్ రెడ్డి, మహమ్మద్ నగర్ ఎంఈవో అమర్సింగ్, అచ్చంపేట ప్రధానోపాధ్యాయులు వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తికి దేహశుద్ధి

● చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి



చికిత్సపొందుతూ మృతిచెందిన శ్రీకాంత్

సదాశివనగర్,మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉత్తనూర్‌లో చోరీకి పాల్పడిన శ్రీకాంత్ (25)కు గ్రామస్తులు దేహశుద్ధి చేయగా చికిత్సపొందుతూ కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో మృతిచెందాడని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే యువకుడు మద్యానికి బానిసై తిరుగుతుండేవాడని, మద్యం మత్తులో ఆంజనేయస్వామి ఆలయంలో గల హుండీని పగలగొట్టి చిల్లరపైసలను మూటగట్టుకుని వెళ్తుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. శ్రీకాంత్‌పై గ్రామస్తులు దేహశుద్ధి చేయడంతో గాయాల పాలయ్యాడు. వెంటనే అతడిని కామారెడ్డి ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. ఈ విషయంపై సదాశివనగర్ పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రామారెడ్డి నూతన తహసీల్దార్‌గా ఉమాలత బాధ్యతల స్వీకరణ



బదిలీపై వెళుతున్న తహసీల్దార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

రామారెడ్డి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో సెక్షన్ డీ విభాగంలో సూపరింటెంటెండెంట్‌గా విధులు నిర్వహించిన ఉమాలత బుధవారం రామారెడ్డి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికాంత్, సీనియర్ అసిస్టెంట్ విద్యాసాగర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. రామారెడ్డి తహసీల్దార్‌గా ఇదివరకు విధులు నిర్వహించిన సువర్ణ బదిలీపై బాన్సువాడ ఆర్డీవో కార్యాలయంలో సర్వే నిర్వహణ అధికారిగా వెళ్లారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సువర్ణకు శాలువా కప్పి మెమోంటో అందజేసి చేసి ఘనంగా సన్మానించారు.

ఎల్లారెడ్డి తహసీల్దార్‌గా ప్రేమ్‌కుమార్..

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి తహసీల్దార్‌గా ప్రేమ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎల్లారెడ్డిలో పనిచేసిన తహసీల్దార్ మహేందర్ జుక్కల్ మండలానికి బదిలీపై వెళ్లారు. ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేసిన ప్రేమ్‌కుమార్ ఎల్లారెడ్డి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు.

గాంధారి తహసీల్దార్‌గా రేణుకచౌహాన్...

గాంధారి : మండల తహసీల్దార్‌గా బుధవారం రేణుకచౌహాన్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. రేణుకచౌహాన్ డొంగ్లి మండలం నుంచి గాంధారికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ సతీష్‌రెడ్డి రాజంపేటకు బదిలీపై వెళ్లారు. గాంధారి తహసీల్దార్‌గా విధుల్లో చేరిన రేణుకచౌహాన్‌కు రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు.

నూతన తహసీల్దార్‌గా సతీష్‌రెడ్డి..

రాజంపేట : రాజంపేట నూతన తహసీల్దార్‌గా సతీష్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గాంధారి నుంచి రాజంపేటకు బదిలీపై రావడంతో నాయబ్‌తహసీల్దార్ సంతోష్, ఆర్ఐ లక్ష్మయ్య పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మెరుగైన సేవలు అందిస్తానన్నారు.



పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

కాగితాలకే పరిమితమయ్యే బడ్జెట్

● నీలం చిన్నరాజులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం కాగితాలకే పరిమితమయ్యే బడ్జెట్‌లానే ఉంది. గతంలో ఆరు గ్యారెంటీలంటూ చెప్పి చాలా మంది ప్రజలకు మొండిచేయి చూపింది. వ్యవసాయ రంగానికి, నీటి పారుదల శాఖకు, విద్యా, వైద్యా న్ని విస్మరించింది. మొత్తానికి గత సంవత్సరం మాదిరి గానే అంకెల మాయ చేస్తున్నారే తప్ప ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి సరిపడే బడ్జెట్‌ను తీసుకు రావడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతోంది.

బడ్జెట్ తగ్గించారు ● ప్రవీణ్, ఎస్‌టీయూ నాయకుడు

విద్యకు గత సంవత్సరం కంటే బడ్జెట్‌ను తగ్గించారు. గత సంవత్సరం 7.75శాతం బడ్జెట్ కేటా యిస్తే ఈ సంవత్సరం 7.57 శాతం మాత్రమే కేటా యించడం కొద్దిమేర ఆందోళన కల్గిస్తున్న అంశం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠ శాలల నిర్మాణానికి రూ.11,600 కోట్లు అనుమతులు మంజూరు చేయడం చారిత్రాత్మకమే.

సంక్షేమానికి పెద్దపీట

(5వ పేజీ తరువాయి)

కేటాయించారు. గృహ నిర్మాణానికి రూ. 14,154 కోట్లు కేటాయించారు. విద్యా రంగానికి రూ.23,108 కోట్లు, వైద్య రంగానికి రూ.12,393 కోట్లు, నీటి పారుదల శాఖకు రూ.23,373 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకు రూ.31,605 కోట్లు, మున్సిపల్‌శాఖకు రూ.17,677 కోట్లు, విద్యుత్ రంగానికి రూ.21,221 కోట్లు, పర్యాటక రంగానికి రూ.775 కోట్లు ఇలా పలు రంగాలకు పెద్ద మొత్తంలోనే నిధులు కేటాయించారు.

బడ్జెట్‌పై ప్రతిపక్షాల పెదవి విరుపు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌పై జిల్లాలోని ప్రతిపక్ష పార్టీల నేతలు పెదవి విరుస్తున్నారు. మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన రూ.3.04లక్షల బడ్జెట్‌ను అంకెలకే, కాగితాలకే పరిమి తం కానుందని రాష్ట్ర అభివృద్ధికి గాని, ప్రజల సంక్షేమానికి ఉపయోగపడదని ప్రతిపక్షాల పార్టీల నాయకులు పేర్కొంటున్నారు. సంక్షేమానికి పెద్దపీట వేస్తు న్నమంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకొస్తున్నా ఆశించిన మేర నిధులు కేటాయిం చలేదని, ఆరు గ్యారెంటీలను విస్మరించారని దీంతో పాటు వ్యవసాయ రంగానికి, నీటి పారు దలశాఖకు, విద్యా, వైద్యానికి పెద్ద మొత్తంలో నిధులను ఈ బడ్జెట్‌లో పెట్టలేక పోయారు. ఎన్నో సంవత్సరాల నుంచి నీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతలు, పెండింగ్‌లో ఉన్నాయని వాటికి కూడా పూర్తిస్థాయిలో నిధులను కేటాయిం చలేక పోయిందని మండి పడుతున్నారు. గత ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను పూర్తిస్థాయిలో ఖర్చు చేయలేదని ఆరు గ్యారెంటీలను అమలు చేయలేకపోయిందని ప్రతి పక్ష నేతలు ఆరోపిస్తున్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

బిచ్కుంద, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల పరిష్కారవేదికను శుక్రవారం ఉదయం 10.30కు విద్యుత్ ఉపకేంద్రంలో ఏర్పాటు చేయనున్నట్లు ఏఈ పవన్ తెలిపారు. సమస్యలు పరిష్కరించడానికి ఎంపీడీసీఎల్ డీఈ గంగాధర్ హాజరవుతున్నట్లు తెలిపారు.

'100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి'

లింగంపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంచాయతీ కార్యదర్శులు 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఎంపీడీవో నరేష్ అన్నారు. ఆయన బుధవారం లింగంపేట మండల పరిషత్తు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఎఫ్ఏలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో మలహారి, ఏపీవో, కార్యదర్శులు, ఎఫ్ఏలు ఉన్నారు.

రెండు వాహనాల సీజ్



వాహనాలు తనిఖీలు చేసిన ఎస్సై నరేష్

రామారెడ్డి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు కామారెడ్డి - భీమ్‌గల్ రోడ్డుపై రామారెడ్డి మండల కేంద్రంలో గొల్ల పల్లి గ్రామ స్టేజీ వద్ద సాయంత్రం ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశా రు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో డ్రైవింగ్ లైసెన్స్ హెల్మెట్లు లేకుండా మద్యం తాగి వాహనాలు నడిపిస్తున్న రెండు వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై నరేష్ వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రవీందర్, కానిస్టేబుళ్ల తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు

నసురుల్లాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరి కాదని మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నారు. బుధవారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని బాన్సువాడ - నిజామాబాద్ ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు జుబేర్, గణేష్, నర్సింలు గౌడ్, టేకుర్ల సాయి నాయకులు పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న మండల విద్యాశాఖ అధికారి

బాన్సువాడ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, మండలంలో ఉన్న పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామని మండల విద్యాశాఖాధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. మొత్తం ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, పరీక్షా కేంద్రాలలో 1,180 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, తాగునీరు సౌకర్యం, ఫర్నీచర్ తదితర ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఇసుక ట్రాక్టర్ ట్రాలీ బోల్తా

నాగిరెడ్డిపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోలి లింగాల్ శివారులోని మంజీరా నది నుంచి బుధవారం సాయంత్రం ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ట్రాలీ ప్రమాదవశాత్తు వరి పంట పొలంలో బోల్తా పడింది. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సీసీరోడ్ల నిర్మాణం కోసం నాగిరెడ్డిపేట గ్రామానికి 20 ట్రాక్టర్లకు, జలాల్‌పూర్ గ్రామానికి 22 ట్రాక్టర్లకు గోలిలింగాల్ శివారులోని మంజీరానది నుంచి ఇసుకను తరలించేందుకు అనుమతులు ఇచ్చినట్లు ఆర్ఐ ముహమ్మద్ తెలిపారు. మంజీరా నది నుంచి ట్రాక్టర్ ద్వారా ఇసుకను తరలిస్తుండగా గ్రామ శివారులో వాడి గ్రామానికి చెందిన మన్నే వెంకట్ వరి పంట పొలంలో ఇసుక ట్రాక్టర్ ట్రాలీ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఇసుక ట్రాక్టర్ ట్రాలీ వరి పంట పొలంలో బోల్తా పడడంతో, ట్రాలీలో ఉన్న ఇసుక వరి పంటపై పడి తమకు నష్టం వాటిల్లిందని రైతు మన్నె వెంకట్ ఆరోపించారు. రెవెన్యూ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



బోల్తా పడిన ఇసుక ట్రాక్టర్

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బిచ్కుంద,మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి కొత్తబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదించినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మల్లికార్జున్ అప్ప, పీసీసీ డెలిగేట్ సభ్యులు విఠల్‌రెడ్డి, నాయకులు నౌసనాయక్, గంగాధర్, అశోక్,లింగం పాల్గొన్నారు.

గాంధారి : మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అసెంబ్లీలో ప్రవేశ పెట్టినందుకు కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తూర్పు రాజు లు, మాజీసర్పంచ్ సంజీవ్, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఆకుల లక్ష్మణ్, లైన్‌రమేష్, మాజీ సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - దిల్‌రూబ
ప్రియా 70 - ఆఫీసర్ ఆన్ డ్యూటీ
ప్రియా 35 - ఛావా

బాన్సువాడ

మహేశ్వరి - మజాకా
వెంకటేశ్వర - దిల్‌రూబా

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	150	180

